క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

కూడేరు: బాల్య వివాహాలతో శారీరక ఎదుగుదల లేకపోవడంతో తల్లీబిడ్డలకు ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి అన్నారు. సోమవారం కూడేరులోని వెలుగు కార్యాలయంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సర్పంచ్ లలితమ్మ, సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ, హెల్త్ సూపర్ వైజర్లు యశోద, రవీంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ:ఉరవకొండ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులతో కలిసి సీపీఎం నాయకులు సోమవారం ఆందోళన చేశారు. సీపీఎం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటను విక్రయించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సాగు చేసిన పంటను కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారన్నారు. మార్కెట్లో దళారులు తూకాల్లో మోసం చేస్తున్నారన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేష్, వినోద్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలో ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ మునివేలు, ఎస్‌ఐ నబీరసూల్ సూచించారు. సోమవారం బండూరులోని ఆర్డీటీ కాలనీలో గ్రామస్తులతో పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని చట్టాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను రక్షించేందుకు రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఈ చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డీఏ మంజూరు చేయాలి

ఉరవకొండ: ప్రభుత్వం సంక్రాంతి నాటికి ఉద్యోగులకు జనవరిలో సంక్రాంతి కానుకగా ఒక డీఏ అయినా మంజూరు చేయాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఎస్టీ కాలనీలో హద్దులు చూపండి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలోని రోడ్లకు సంబంధించి రీసర్వే చేసి, హద్దులు చూపాలని బంజారా ఎంప్లాయిస్ అండ్ విలేజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మండల తహసీల్దార్ షర్మిళకు సోమవారం వినతి పత్రం అందించారు. బంజారా ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు లాల్యానాయక్, ఉమ్లానాయక్, ప్రభాకర్ నాయక్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన పూల రాము రోడ్డు ప్రమాదానికి గురై అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, కౌన్సిలర్ లక్ష్మన్న సోమవారం పరామర్శించారు.

జవాబుదారీగా పనిచేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట: ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భవాని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. గొల్లపల్లి, గలగల, కె.పి.దొడ్డి గ్రామాల్లో పేదలకు అనువుగాని ప్రదేశాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చారని సర్పంచ్ రమేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు చంద్ర గ్రహణం

- గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి
- కుదేలైన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు
- పెరిగిన నేరాలు..తగ్గని ఘోరాలు
- అనూహ్యంగా మారిన రాజకీయ ముఖచిత్రం
- ఏప్రిల్ నుంచి డిసెంబర్ ఆఖరు వరకు 12 పథకాలకు బాబు సర్కార్ ఎగనామం





రాయదుర్గం: 2024 సంవత్సరం అనూహ్యంగా రాజకీయ ముఖచిత్రం మారింది. ఏప్రిల్ సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు.. ఆయన పాలనంతా పేదల జీవితాల్లో వెలుగులు నింపింది. ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం వర్తించింది. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలకు ఈఏడాది అంతా అర్ధచంద్ర గ్రహణం పట్టింది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ కుదేలయ్యాయి. పేదలకు సంక్షేమ పథకాలు ఊసేలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. ప్రచారానికే 'సూపర్ సిక్స్' పాలనంతా డకౌట్ అన్నట్లుంది. పేరుకే ప్రజాప్రతినిధులున్నా.. పింఛన్లు పంపిణీ తప్ప.. ఏ ఒక్కటీ అమలుకాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న పాలనలో రూ.1327 కోట్లు లబ్ధి..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గత వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల ఖజానా గలగల లాడేది. గతేడాది 2023–2024 మార్చి దాక వివిధ పథకాల కోసం రూ.1327 కోట్లు ఖర్చుచేశారు. ఈ మొత్తం 10,50,509 లక్షల మంది ఖాతాలకు నేరుగా చేర్చి వారి జీవనోపాధికి పెద్దపీట వేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడు నెలలైనా పిసరంత సాయం అందించలేదు.

కుదేలైన విద్య, వైద్యం, వ్యవసాయం..

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. విప్లవాత్మక సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చింది. నాడు–నేడుతో బడుల రూపురేఖలు మారిపోయాయి. పేదల విద్యాభివృద్ధికి నూతన ఒరవడిని శ్రీకారం చుట్టారు. వైద్య రంగంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం మొదలు 108, 104, హెల్త్ సెంటర్లు, ఇంటి ముంగిటకే మెరుగైన వైద్య సేవలు అందించారు. ఊరూరా రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఏడు నెలలకే ఏడింతల కష్టాలు అనుభవించాల్సి వస్తోంది. విద్యుత్‌చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.

పెరిగిన నేరాలు .. అధికార పార్టీ అరాచకాలు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత శాంతిభద్రతలు లోపించాయి. ఈ ఏడు నెలల్లో రాయదుర్గం నియోజకవర్గంలోనే సుమారు 10 హత్యలు జరిగాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అధికార పార్టీ అరాచకాలు పెచ్చుమీరిపోయాయి. చోరీలు, రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయి. సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు ఇలా ఎక్కడబడితే అక్కడ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేయించారు. ఊరూరా బెల్టుషాపులు తెరిచారు. ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. పేకాట క్లబ్‌లు పుట్టుకొచ్చాయి.

ఆయకట్టుకు సాగునీరు

గతేడాది దేశ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. ఈఏడాది వరుణదేవుడు కరుణించాడు. బీటీ ప్రాజెక్ట్ నిండుకుండను తలపించింది. గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లోని ఆయకట్టుకు సాగునీటి విడుదలకు ముహూర్తం ఖరారైంది. తుంగభద్ర జలాశయం 16వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయింది. ఈ చేదు వార్త కొన్నాళ్లు ఆందోళన కలిగించింది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 2024 ప్రధాన అంశాలు ఇవీ...



విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా చేయగా, మాజీ ఎమ్మెల్యే విశ్వమరో 15 మందిపై అధికార పార్టీ కక్ష సాధింపు చర్యగా కేసులు నమోదు చేయించింది.

- ఈ ఏడాది జనవరిలో రూ. 3 వేలకు పెంచిన పింఛన్లు నగదు
- పండుగలా ఆసరా కార్యక్రమాలు నిర్వహించారు
- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 16,061 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, శాశ్వత రిజిస్ట్రేషన్ పట్టాలిచ్చారు.
- నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి
- రాయదుర్గంలో సూపర్‌సిక్స్ హామీలపై చంద్రబాబు హామీలిచ్చారు..

గాడితప్పిన శాంతిభద్రతలు..

- రాయదుర్గంలో శాంతి భద్రతలు గాడితప్పాయి. జూన్, జూలై, ఆగస్టు నెలల్లోనే 10 హత్యలు జరిగాయి. ప్రశాంతంగా ఉండే ప్రాంతంలో ఈ ఘటనలు మరువలేనిది.
- సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో భాగంగా సీఎం చంద్రబాబు సహా లోకేష్, నారా భువనేశ్వరి కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పర్యటించారు.
- అధికారంలోకి రాగానే బీటీపీకి నీరిస్తామంటూ రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు.
- మే 4న రైతు దినోత్సవ కార్యక్రమంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గంలో పర్యటించారు. బీటీపీ భూసేకరణ రైతుకు ఆ వేదిక మీదే రూ.202 కోట్లు విడుదల చేశారు.
- ఇటీవల కుందుర్పి మండలం రుద్రంపల్లిలో మిద్దెకూలి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందారు.
- కూటమి అధికారంలోకి వచ్చిరాగానే కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమా మహేశ్వర ఇంటిపై అధికార పార్టీ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. ఆస్తులు ధ్వంసం చేశారు. ఇలాంటివి మరో ఐదారు ఘటనలు ఉన్నాయి.
- ఉరవకొండలో ఎప్పుడు లేని విధంగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 3 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. రాష్ట్రంలో అత్యధికంగా 26 వేల మందికి సొంతింటి కల సాకారం చేశారు.



ఇటీవల కళ్యాణదుర్గంలో కౌన్సిలర్ వాహనానికి నిప్పు పెట్టిన అధికార పార్టీ నాయకులు

- కూటమి అధికారంలోకి వచ్చిరాగానే జిల్లాలో ఎక్కడా లేని విధంగా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లలోకి చొరబడి దాడులు చేశారు. సుమారు 50 ఘటనలకుపైగా చోటు చేసుకున్నాయి.
- రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయి. పలుచోట్ల కూలీలు దుర్మరణం చెందారు.
- సచివాలయాలు, ఆర్‌బీకేలు ఇతర ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అయ్యాయి. ఇలాంటివెన్నో.

ఘనంగా వాల్మీకి జయంతి



జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కుందుర్పి: మద్యనపల్లిలో వాల్మీకి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతులు, కలశాలు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. ట్రాక్టర్‌లో వాల్మీకి చిత్ర పటాన్ని ఉంచి ఊరేగించారు. వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు.

పాఠశాలకు స్థలం కేటాయింపు



స్థల దాత గంగమ్మను సన్మానిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రానికి చెందిన పాములాటి తిమ్మారెడ్డి సతీమణి గంగమ్మ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు ఐదెకరాల భూమిని దానం చేశారు. ఈసందర్భంగా స్థల దాత గంగమ్మను సోమవారం సన్మానించారు. ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ పాఠశాలకోసం భూమి దానం చేయడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, హరీష్, మాజీ సర్పంచు పెద్ద నరసింహులు, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల జారీపై విచారణ చేపట్టాలి

ఉరవకొండ: మండలంలో ఎరికల కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు జరిగాయని, విచారణ చేపట్టాలని ఏపీ ఎరికల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ బోగన్నగౌడ్‌కు ఎరికుల సేవా సంఘం తరపున వినతి పత్రం అందించారు. రాష్ట్ర కార్యదర్శి శేఖర్ మాట్లాడుతూ గతంలో ఎరికుల కులస్తులకు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను ఇతర కులాలకు చెందిన వారికి భారీగా డబ్బులు తీసుకొని అధికారులకు జారీ చేశారని అన్నారు. ప్రస్తుతం నకిలీ ధ్రువీకరణ పత్రాలతో వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు వసంత్, ఉపాధ్యక్షుడు గంగన్న, కార్యదర్శి సోమశేఖర్, గంగన్న పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

రాయదుర్గంటౌన్: నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీనియర్ న్యాయవాది బీపీ శేషాద్రి మృతి ముమ్మాటికీ పోలీసుల వైఖరేనని రాయదుర్గం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి అన్నారు. న్యాయవాది మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసనకు దిగారు. సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ వన్నూరుస్వామి, న్యాయవాదులు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసన్, నాగరాజు, వాహాబ్, జాన్సన్, గౌని ప్రతాప్, లోకానంద, చన్నవీర, మల్లేశప్ప, శ్యామలమ్మ, రవిచంద్ర, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ముందు నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

సీఐపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన సీఐ శాంతిలాల్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణ బార్ అసోషియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం కళ్యాణదుర్గంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ అనంతపురంలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శాంతిలాల్‌పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

దోషులను శిక్షించాలి

రాయదుర్గంటౌన్:అనంతపురంలో సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి కారకులైన త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీసీవై పార్టీ ఇన్‌చార్జ్ గౌని ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలి

కూడేరు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం, సీపీఐ, దండోరా, కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నిరసన తెలియజేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి, మండల కార్యదర్శి కరీం, సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా నేత రమణ, దండోరా జిల్లా నేతలు రాజు, లక్ష్మన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ స్వామి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

రాయదుర్గంటౌన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై హోంశాఖమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున అన్నారు. సోమవారం దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మొలకాల్మూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ చేశారు. సీపీఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, అంజి, నాగేంద్ర, కృష్ణానాయక్, తిప్పేస్వామి పాల్గొన్నారు.



రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ఉరవకొండ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక క్లాక్ టవర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, సుల్తాన్, సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్, రంగారెడ్డి మాట్లాడారు. శీనప్ప, జ్ఞానమూర్తి, వీరాంజి, మురళీ, వినోద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

- సమన్వయకర్త తలారి రంగయ్య

కంబదూరు/బ్రహ్మసముద్రం : గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా సమష్టిగా పని చేద్దామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ కల్యాణ మంటపంలో వైఎస్సార్‌సీపీ నేతలు మాదినేని ఉమా మహేశ్వరనాయుడు, తిప్పేస్వామితో కలిసికార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ ఎంపిక కోసం కార్యకర్తలతో అభిప్రా యాలు సేకరించారు. జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, జి ల్లా నాయకులు గోవింద్, నీలి శంకరప్ప, డాక్టర్ బొమ్మయ్య, హను మంతరాయుడు, మండల కన్వీనర్ బాలరాజు, యువజన నాయకుడు బీమేష్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, తిమ్మరాయుడు, రామ్మో హన్, గోళ్లసూరి, నారాయణపురం వెంకటేశులు, అండేపల్లి రామాంజనేయులు, మల్లూరి వెంకటేశులు , శ్యామంత్‌రెడ్డి, సర్పంచ్‌లు హరినాథ్, చంద్రశేఖర్, అమ ర్,రాజగోపాల్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, బసప్ప, కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ మైనార్టీ నాయకుడు దాదు, తిప్పేపల్లి నాగేంద్ర, రామస్వామి, వెంకటప్ప, అ య్యంపల్లి నాగరాజు, గురు, కిరణ్, వడ్డే అంజి, సునీల్,రాజు,ఇడిగ పవన్, మారుతి, హరి, బేల్దారి హనుమంతరాయుడు, రామకృష్ణ, కావేటి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



బ్రహ్మసముద్రంలో మాట్లాడుతున్న రంగయ్య

కార్యకర్తలు పార్టీకి పట్టు కొమ్మలు

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి పట్టు కొమ్మలు అని మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత ఉమామహేశ్వర్ నాయుడు అన్నారు. సోమవారం బ్రహ్మసముద్రంలో నంజాపురం గోపాల్ రెడ్డి వ్యవసాయతోటలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రఘునాథరెడ్డి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్, నాయకు లు గంగాధ రప్ప, నారాయణపురం వెంకటేష్, ఎమ్మెస్ హనుమంతరాయుడు, గోళ్ల సూరి, కృష్ణమూర్తి, కరణం రా హుల్, చంద్రశేఖ ర రెడ్డి, గోపాల్‌రెడ్డి, తిరుపాల రెడ్డి, మాజీ ఎంపీపీ మహాదేవప్ప, మాజీ ఎంపీటీసీ లోకేష్ సర్పంచులు రామ్మోహన్ , శెట్టిగారి మంజునాథ, ఆది నారాయణ రెడ్డి, ఎంపీటీసీలు నరసింహ, నగేష్, బు సప్ప, తిప్పేస్వామి, నాయకులు ఎర్రిస్వామి, జిన్నామల్లి, దేవపుత్ర, నరసింహులు, నాగరాజు, తిమ్మారెడ్డి, ఏసేప్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

కళ్యాణదుర్గం రూరల్: సకాలంలో ఇంటిపన్ను, కొలాయి పన్ను చెల్లించి కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపాల్ కమిషనర్ వంశీ కృష్ణ తెలిపారు. సోమవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు తమ ఇంటి పన్ను, కొలాయి పన్ను సకాలంలో చెల్లించాలన్నారు. కేవలం మున్సిపాలిటీ పరిధిలోనే ఇంటిపన్ను రూపంలో రూ.7కోట్లకు పైగా ప్రజలు మున్సిపాలిటీకి బకాయి ఉందన్నారు. కొందరు భవనాలు నిర్మించుకునేవారు ఒక ఫ్లోర్ కట్టుకునేందుకు మున్సిపాల్ పర్మిషన్ తీసుకుని 3 నుంచి నాలుగు అంతస్తులు నిర్మిస్తున్నారన్నారు.

నిధుల మంజూరు

వజ్రకరూరు: ఉరవకొండ డివిజన్‌లోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు అయినట్లు ఏఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్ తెలిపారు. సోమవారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆయన మాట్లాడారు.

కాపర్ దొంగలు అరెస్టు

కూడేరు: మరుట్ల–2, బ్రాహ్మణపల్లి, కమ్మూరు, జల్లిపల్లిలోని కాపర్ దొంగలను అరెస్టు చేసినట్లు క్రైం బ్రాంచ్ సీఐ ఇస్మాయిల్, సీఐ రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి సమీపంలో బుక్కరాయసముద్రానికి చెందిన నాగన్న, వేపచెర్లకు చెందిన ఆంజనేయులు, అనంతపురంలోని నాయక్ నగర్‌కు చెందిన మావెళ్ల వేణును అదుపులోకి తీసుకున్నట్లు క్రైంబ్రాంచ్ సీఐ ఇస్మాయిల్, కూడేరు సీఐ రాజులు తెలిపారు.

అనుమతి లేకుండా నిర్మిస్తున్నా పట్టించుకోరా?

ఉరవకొండ: స్థానిక రాములమ్మ గుడి వద్ద 42వ జాతీయ రహదారి వద్ద అనంతపురం రోడ్డు వైపు సర్వేనం 542లో ప్రజావసర నిమిత్తం కేటాయించిన స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసి ఏకంగా భవన సదుపాయం నిర్మిస్తుంటే పట్టించుకోలేదని వార్డు సభ్యులు నిలదీశారు. సోమవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పాలకవర్గ సాధారణ సమావేశం సర్పంచు మీనుగ లలితమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఈఓ గౌస్ సాహెబ్ దృష్టికి పంచాయతీ స్థలాల అన్యాక్రాంతం చేసిన అంశాలను వార్డు సభ్యు లు తెచ్చారు. రూ.50 లక్షలు విలువ చేసే స్థలంలో ఆక్రమించుకొని పక్కా భవనం నిర్మిస్తుంటే చర్యలు తీసుకోరా? అంటూ ప్రశ్నించారు. ఈఓ మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని అడ్డుకోవడానికి వెళ్తే దాడికి తెగబడ్డారున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి భవన నిర్మాణాన్ని ఆపేలా చర్యలు తీసుకుంటామన్నారు.అనంతరం అజెండాలోని ప్రధాన సమస్యలపై చర్చించి పలు బిల్లులకు ఆమోదం తెలిపారు.



సమావేశంలో ఈఓను నిలదీస్తున్న సభ్యులు

సంక్షిప్త సమాచారం

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం జరుపుకున్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు మనోహర్ హాజరుకాగా, జెండా ఆవిష్కరణ చేశారు. హెచ్ఎం అశోక్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు పద్మ, వలి, అనిల్, గణేష్, భాను ప్రకాష్, దేవరాజ్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

బొమ్మనహాళ్: న్యూఇయర్ వేడుకల పేరుతో గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడారు. నేటి నుంచి తనిఖీలు ఉంటాయన్నారు. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. కోడి పందేలు, పేకాట, మద్యం తాగి అల్లర్లు చేయడం వంటివి నిషేధమన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు ఆధ్వర్యంలో సోమవారం ఎంపిక చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శిగా హారున్ రషీద్, ఉపాధ్యక్షులుగా రాజేష్, వెంకీ, సాగర్, అభి, సహాయ కార్యదర్శి నవీన్, అశోక్, సురేష్, మరో 12 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

1న లైవ్ సర్టిఫికెట్ కోసం బయోమెట్రిక్

రాయదుర్గంటౌన్: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ విశ్రాంత పెన్షనర్ల భవనంలో జనవరి 1న బయోమెట్రిక్ సిస్టం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

కూడేరు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై శ్రద్ధ చూపాలని తహసీల్దార్ మహబూబ్ బాషా ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో సిబ్బందితో సమావేశమై రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలపై సమీక్షించారు. డీటీ సూర్యప్రతాప్, సర్వేయర్ అయేషా సిద్దికి, రీసర్వే డీటీ ప్రసాద్, వీర్వోలు పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించండి

శెట్టూరు: మండలంలో అద్దెభవనాల్లో ఉన్న అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నాయకులు తిప్పేస్వామి, మహేష్, రామన్న పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బ్రహ్మసముద్రం : గొంచిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.8,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ సోమవారం తెలిపారు.

మూర్ఛతో వ్యక్తి మృతి

రాయదుర్గం: మండలం ఉడేగోళం మద్దానేశ్వరస్వామి ఆలయం సమీపంలో మూర్ఛతో అంబేడ్కర్ కాలనీకి చెందిన దుర్గప్ప అనే వ్యక్తి సోమవారం మృతిచెందాడు. అర్బన్ సీఐ జయానాయక్ మాట్లాడుతూ దుర్గప్ప మతిస్థితిమితం లేకుండా తిరిగేవాడన్నారు. మూడు రోజులుగా ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు.

వేలం పాటలో రూ. 3.14 లక్షల ఆదాయం

కుందుర్పి: మండల కేంద్రంలోని రామస్వామి ఆలయ ఆవరణలో సోమవారం చింతతోపు, సంత మార్కెట్‌లకు వేలం పాట నిర్వహించారు. సర్పంచు మారుతీశ్వరి సమక్షంలో నిర్వహించిన వేలంలో సంత మార్కెట్ రూ. 2.76 లక్షలు, చింత తోపు రూ. 38 వేల ఆదాయం వచ్చింది.

